ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 21.01.2025 సమయం. 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సభలు కొనసాగుతున్నాయి.
2. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల రెండో రోజున ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానుంది.
3. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో సింగరేణి, ఎన్టీపీసీ కార్మికుల సమస్యలను లేవనెత్తుతానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ చెప్పారు.

గ్రామ సభలు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేయనుంది. ఈ పథకాలకు లబ్ధిదారులను ఖరారు చేయడం కోసం ప్రభుత్వం నేటి నుంచి ఆయా జిల్లాల్లో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహిస్తోంది. ఈ నెల 24వ తేదీ వరకు ఈ గ్రామ సభలు జరుగుతున్నాయి. ఇప్పటికే నిర్వహించిన ఇంటింటి సర్వే ద్వారా పథకాలకు అర్హతలున్న వారి జాబితాను అధికారులు ఈ సభల్లో వెల్లడిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులు వాటిని స్వీకరిస్తారు. ఈ నెల 26వ తేదీలోగా లబ్ధిదారుల తుది జాబితాను తయారు చేయనున్నారు. అలాగే కొత్త ధరకాస్తులను కూడా గ్రామ సభల్లో అధికారులు స్వీకరిస్తారు.

(డెస్క్)

సిరిసిల్ల-గ్రామసభ

రాష్ట్ర ప్రభుత్వ కొత్త పథకాల అమలుకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు పలు గ్రామాల్లో గ్రామ సభలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గ్రామాలలో లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

గ్రామ సభ నాగర్‌కర్నూల్

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. నాగర్ కర్నూల్ మండలం గుడిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల విషయంలోప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని సూచించారు.

(PTC నాగర్‌కర్నూల్ జిల్లా)

**CM-DAVOS**

స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక 55 వ వార్షిక సమావేశం నేపథ్యంలో ఏర్పాటు చేసిన భారత పెవిలియన్ ను కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరీ తో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి A రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి D శ్రీధర బాబు, కేరళ పరిశ్రమల శాఖ మంత్రి, P. Rajeev కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన తెలంగాణా రాష్ట్ర పెవిలియన్ ను కూడా వీరు లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణా చేపట్టిన వివిధ ప్రాజెక్టుల గురించి ఈ సందర్భంగా విస్తృత చర్చ జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఆహార శుద్ధి, నైపుణ్యాభివృద్ధి రంగాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సాధ్యమైనంత మద్దతు ఇచ్చేందుకు ఇద్దరు కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారు. కాగా, ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల రెండో రోజున ఈ రోజు పలు సదస్సులు, సమావేశాల్లో ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర అధికార బృందం పాల్గొంటోంది. పలు బహుళ కంపెనీల CEO లతో భారత పరిశ్రమల సమాఖ్య-CII సారధ్యంలో వివిధ కంపెనీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. అంతకుముందు భారత పెవిలియన్ ప్రారంభంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లుడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు.

(సౌండ్ బైట్ శ్రీధర్ బాబు)

తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు.

(MSL)

**పథకాలు-మంత్రి పొన్నం ప్రభాకర్**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి చేకూరుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు నుంచి గ్రామాల్లో జరిగే గ్రామ సభలు ,వార్డు సభల్లోనే లబ్దిధారుల ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హతలు ఉండి పథకాలకు ఎంపికకాని వారు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు. పథకాల విషయంలో ప్రతిపక్ష పార్టీలు చేసే ప్రకటనలను నమ్మవద్దన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా జారీ చేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈనెలలోనే మరో 4 పథకాల ప్రారంభం అవుతాయని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయని ప్రజలు ఎవరు అధైర్యపడవద్దని సూచించారు.

(డెస్క్)

**CHHATTISGARH-ENCOUNTER**

ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో గత రాత్రి అంతర్రాష్ట్ర సంయుక్త గాలింపు చర్యలో 14 మంది మావోయిస్టులు మరణించారు. చత్తీస్ గడ్ జిల్లాలోని కుల్హారీఘాట్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో పెద్ద సంఖ్యలో మావోయిస్టుల ఉనికిపై నిఘా విభాగానికి ఖచ్చితమైన సమాచారం అందడంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, CRPF సిబ్బంది సంయుక్తంగా ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా, ఒడిశాలోని నుపాడా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు నిర్వహించారు. గత 24 గంటలుగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ కాల్పుల నేపథ్యంలో ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలు లభ్యం కాగా, ఈ ఉదయం ఘటనా స్థలం నుంచి మరో 12 మంది మావోయిస్టుల మృతదేహాలను కనుగొన్నారు.

NSD

**HOME MINISTER**

నక్సల్స్-రహిత భారత్ దిశగా కీలక ముందడుగు వేసినట్లు కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నిన్న ఛత్తీస్ ఘడ్ లో నిర్వహించిన ఆపరేషన్ లో 14 మంది మావోయిస్టులు మరణించటంపై కేంద్ర హోమ్ మంత్రి ట్విటర్ వేదికగా ఈ విషయం పేర్కొన్నారు.

MSL

**చీరల ఆర్డర్**

తమ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫాం చీరల ఆర్డర్ ఇచ్చి భారీ స్థాయిలో ఉపాధి కల్పించిందని ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్స్ అందజేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 30 వ తేదీ లోపు ఈ చీరలు సిద్ధం కానున్నాయని తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

స్వచ్ఛ భారత్:

హైదరాబాద్ లో స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పురోగతి వంటి అంశాలను కేంద్ర స్వచ్ఛ బారత్ మిషన్ అర్బన్, సంయుక్త కార్యదర్శి రూపా మిశ్రా ఈ రోజు పరిశీలించారు. నగరంలో PM స్వనిధి పథకం అమలును కూడా సంయుక్త కార్యదర్శి పరిశీలించారు. GHMC కమిషనర్ ఇలాంబర్తి సహా ఉన్నతాధికారులు పథకాల అమలు తీరును వివరించారు.

(ఎంఎస్ఎల్)

హైదరాబాద్-ఐటీ దాడులు

హైదరాబాద్ లోని పలువురు సినీ ప్రముఖుల నివాసాలు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఈ ఉదయం నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలకు చెందిన సముదాయాల్లో ఏకకాలంలో పలు బృందాలుగా తనిఖీలు చేపట్టారు.

(డెస్క్)

**పోస్టల్**

హైదరాబాద్ నగర తపాలా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఫ్రాంచైజీ అవుట్ లెట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ సిటీ తపాలా డివిజన్, సీనియర్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫ్రాంచైజీలు ఇన్ లాండ్ స్పీడ్ పోస్ట్, ఇన్ లాండ్ రిజిస్టర్డ్ లెటర్ల బుకింగ్, పోస్టేజీ, రెవెన్యూ, కేంద్ర నియామక రుసుము స్టాంపుల విక్రయం తదితర కార్యకలాపాలను చేపట్టవచ్చునని పేర్కొన్నారు. అదనంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కోసం నేరుగా ఏజెంట్‌గా కూడా పనిచేస్తూ సంబంధిత సేవలను అందించవచ్చని తెలిపారు. పోస్టల్ ఫ్రాంచైజీకి లభించే కమీషన్, అర్హతలు, దరఖాస్తు పత్రాల వివరాల కోసం అబిడ్స్ లోని హైదరాబాద్ సిటీ డివిజన్ కార్యాలయం ఈమెయిల్ ఐడీ ssposhcdcity@gmail.com కు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

డెస్క్

పెద్దపల్లి-ఎంపీ

రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో సింగరేణి, ఎన్టీపీసీ కార్మికుల సమస్యలను లేవనెత్తుతానని పెద్దపల్లి లోక్ సభ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ రోజు అధికారులతో రామగుండంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య సమస్యలు లేని కాంట్రాక్ట్

కార్మికులను వయసుతో సంబంధం లేకుండా యధావిధిగా కొనసాగించాలన్నారు. సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల వంటి అంశాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ తెలిపారు.

(పెద్దపల్లి పీటీసీ)